# 18

# చీరెల సుబ్బారావు

అదో పెద్ద ఆఫీసరుగారి బంగళా. ఆ ఆఫీసరుగారెంత గొప్పవారంటే వారి అధికారం చాలా జిల్లాల్లో చెలామణి అవుతుంది. రాష్ట్రంలో అటువంటివారు ఇద్దరో, ముగ్గురో వుంటారు అంతే. మరి ఆఫీసరుగారి హోదాకు తగ్గట్టే ఆయన భవనం అంత దర్జాగానూ ఉంది. ఆ హిందీ అమ్మగారు చాలా హుషారుగా వుంది. ఉత్తర భారతదేశం నుండీ ఆవిడ పుట్టింటి బంధువులు ఓ డజనుమంది వీళ్ళింటికొచ్చారు. మర్నాడే తిరుగు ప్రయాణం. హాల్లో కూర్చుని ఇల్లెగిరిపోయేలా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఫోన్ మోగింది. పనివాడు ఫోన్ తెచ్చి అమ్మగారి కందించాడు. "మేడమ్ చీరెల సుబ్బారావు లైన్లో వున్నాడు" అన్నాడు. ఆవిడ హుషారుగా ఫోనందుకుంది.

"సుబ్రావ్ అన్నీ దొరికాయా! ఇంకా వుంటేనే కూడా మంచివి ఎంచి పట్రా! బయలుదేరుతున్నావా?" అంది హిందీలో. అవతల్నించీ ఏడుస్తూ హిందీలో మాట్లాడు తున్నాడు సుబ్బారావ్. ఆవిడ నొసలు ముడిపడింది. అదేవిటి? నేను చెప్పానుగా! కనుక్కుంటానుండు అనేసి అయ్యగారికి ఫోన్ చేసింది. ఆయన బుర్ర గోక్కున్నాడు. నేను చెప్పాను మరి! కనుక్కుంటాలే కంగారు పడకు అని సెక్రటరీకి ఫోన్ చేసి అడిగాడు. ఆ సెక్రటరీ తెల్లబోయాడు. నేను చెప్పటం చెప్పాను సార్! మళ్ళీ ఫోన్ చేస్తాను అని వెంటనే రామకృష్ణకి ఫోన్ చేశాడు. "చీరెల సుబ్బారావు విషయం మీకు స్పష్టంగా చెప్పాను కదా!" నిలదీశాడు.

"అవును చెప్పారు. నేనూ చెప్పాను" అన్నాడు రామకృష్ణ.

"ఏవిటి మీరు చెప్పింది? అక్కడ సుబ్బారావు నేరుగా అమ్మగారికి ఫోన్ చేశాడుట!"

ఆశ్చర్యపోయాడు రామకృష్ణ "నేను శేఖర్రావుతో మాట్లాడతాను వుండండి" అన్నాడు.

"సరే త్వరగా ఆ పని చెయ్యండి! చేసి నాకు ఫోన్ చేసి చెప్పండి..." అన్నాడు చిరాగ్గా.

రామకృష్ణ సణుక్కుంటూ శేఖర్రావుకి ఫోన్ చేశాడు. ఆ శేఖర్రావు పోటీ పరీక్షల్లో అవలీలగా నెగ్గి నెలరోజుల క్రిందటే క్లాస్‌వన్ ఆఫీసరుగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. ఆవేళ ఇంటర్వ్యూలు వుండటంతో ఆలస్యంగా ఇంటికొచ్చి, భోంచేసి టీ.వి. చూస్తుండగా మోగింది సెల్‌ఫోను.

నెంబరు చూసుకుని నిటారుగా అయిపోయి "సార్ చెప్పండి!" అన్నాడు.

"ఏమిటి చెప్పేది? ఆ చీరెల సుబ్బారావు ప్రమోషన్ విషయంలో ఏం జరిగింది?" అడిగాడు రామకృష్ణ.

"నేనే చేద్దామనుకుంటున్నా సార్! ఆ కేండిడేటు చాలా వీక్‌గా వున్నాడు. శుద్ధ మొద్దవతారం. ఇంటర్వ్యూలో నెగ్గలేకపోయాడు" వినయంగా చెప్పాడు శేఖర్రావు.

"ఇంటర్వ్యూనా? ఇంటర్వ్యూ ఎందుకు చేశావ్? ఎవరు చెయ్యమన్నారు? ప్రమోషనిమ్మని చెప్పాను కదా?" నిలదీశాడు రామకృష్ణ. "అది కాదు సార్! మరీ ఇంటర్వ్యూ కూడా చెయ్యకుండా ప్రమోషనెలా ఇస్తాం? అన్యాయం కదా సార్!"

"అన్యాయమా? ఎవరికీ? నీకా? నాకా? దేశానికా?"

"కాదు సార్! అప్పటికీ నేను చాలా తేలిక ప్రశ్నలే వేశాను. దానికీ బేరుమని ఏడిచాడు. అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఏది అని అడిగాను".

"అలాగా! ఇప్పుడు అరుణాచలప్రదేశ్ రాజధానితో నీకేం పనయ్యా? రిటైరయ్యాక అక్కడ ఇల్లు కట్టుకుని సెటిల్ అయిపోతావా?"

"కాదు సార్! మనిషన్నాక కాస్త లోకజ్ఞానం వుండాలి కదా! అందులోనూ ఇది మరి కాస్త పెద్ద పోస్టే. సరే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు కదా అని మన ఉపరాష్ట్రపతి ఎవరూ? అని అడిగాను. దానికీ సమాధానం లేదు ఏడుపు తప్ప. ఆ

మాత్రం తెలివితేటలు లేనివాడికి ప్రమోషనిచ్చి పెద్ద పదవి ఇస్తే ఎలా చెప్పండి?" నిజాయితీగానే అడిగాడు శేఖర్రావు.

"ఛ. నిజంగానా? నాకు తెలీదులే! మొన్న ఓ పార్టీలో మన పెద్దాయన మన ప్రధాని సోనియా గాంధీ అని ఆవేశంగా రాజకీయాల గురించి మాట్లాడుతూ హఠాత్తుగా ఆగిపోయి నాలుక కరుచుకుని జోకేశా, జోకేశా, అని ఫెళ్ళున నవ్వేశాడు. భలే జోకేశారు సార్ అని మేమూ నవ్వేశాం. మరాయన్ని ఏం చేద్దాం? పదవిలోంచి పీకేద్దామా?"

"అది కాదు సార్. అసలూ"

"అసలూ లేదు కొసరూ లేదు. అతనికి వెంటనే ప్రమోషనిచ్చి అందరికీ మెయిలిచ్చేయ్?" అని చెప్పి ఫోన్ పెట్టగానే మళ్ళీ మోగింది ఫోన్. అవతల సెక్రట్రీ!

"ఏమైంది?" అన్నాడు.

"ఇప్పుడే మాట్లాడాను పనైపోతుంది" అన్నాడు రామకృష్ణ.

"ఇప్పుడు మాట్లాడ్డం ఏమిటీ? అదివరకు చెప్పలేదా?"

"చెప్పాను. కొత్తగా వచ్చిన కుర్రాడు కదా! ఏదో పద్ధతి ప్రకారం పోబోయాడు. ఇంటర్వ్యూ చేశాట్ట చాదస్తంగా" అన్నాడు రామకృష్ణ.

"అతను కొత్తవాడైతే మీరు చూసుకోవాలి కదా! అందులోనూ పరిస్థితి ఎలా వుందో తెలుసుగా. రేపు తెల్లారేసరికి సుబ్బారావు చీరెలతో అమ్మగారి దగ్గరికి వెళ్ళకపోతే మనందరికీ తైల మర్దనాలు తప్పవ్!" అని కాస్త మెత్తగా మందలించాడు సెక్రట్రీ.

అయ్యగారి హాల్లో ఆడంగులంతా దక్షిణాది చీరెల గురించి చర్చించు కుంటున్నారు. గడవాల్, వేంకాట్‌గిరీ, ధడమవడమ్ చీరలంటే చాలా ఇష్టం. నీ దగ్గరికి వచ్చినప్పుడు కొనుక్కోవాలని ఎన్నాళ్ళనించో ఎదురు చూస్తున్నాం! అన్నారు.

అన్నీ ఇక్కడికే వస్తాయి మీరే చూస్తారుగా అంది అమ్మగారు కాస్త గర్వంగా. అంతలోనే మళ్ళీ ఫోన్. మళ్ళీ చీరెల సుబ్బారావు. మళ్ళీ హిందీలో ఏడిచాడు. ప్రమోషన్ ఇచ్చారుగానీ అక్కడెక్కడికో ట్రాన్సఫర్ చేశారుట. ఆవిడకి తిక్కరేగింది. అసలీపాటికి ప్రయాణ సన్నాహాల్లో వుండాల్సిన సుబ్రావ్ ఇంకా ఆఫీసులో పడి ఏడుస్తూంటే

చిరాకొచ్చేసింది. వెంటనే ఫోన్ చేసి మొగుడిని ముక్క చీవాట్లు పెట్టింది. ఆ తిట్లన్నీ అంచెలంచెలుగా మళ్ళీ రామకృష్ణకి చేరాయి.

అతని తల వాచిపోయింది. మళ్ళీ శేఖర్రావుకి ఫోన్ చేశాడు.

"మీరు చెప్పిన సుబ్బారావుకి ప్రమోషన్ నిచ్చేశాను సార్!" అన్నాడు వినయంగా.

"ప్రమోషనిచ్చావు సరే. ట్రాన్స్ఫర్ చేశావా?" అడిగాడు.

"అవును సార్. అతను చాలాకాలంగా ఇక్కడే వున్నాడు. ఒక మనిషి ఒకే చోట స్తంభంలా పాతుకుపోతే రూల్సు ఒప్పుకోవు కదా సార్! అందుకే" వినయంగా వివరించబోయాడు శేఖర్రావు. రామకృష్ణకి కడుపులోంచి దుఃఖం తన్నుకొచ్చింది. "నువ్వెక్కడ దొరికావయ్యా మగడా నాకు? రూల్సు, రూల్సు అంటూ నన్నెందుకిలా కాల్చుకుతింటున్నావ్?" అన్నాడు దీనంగా.

"అదికాదు సార్! మరీ!" అంటూ చెప్పబోయిన శేఖర్రావుని వారించాడు రామకృష్ణ. "ఇక నీతో వాగి చావలేను. నీ స్టెనోకి ఫోనివ్వు!" అన్నాడు.

స్టెనో నారాయణప్ప లైన్లోకి వచ్చాడు. బాస్కి బాస్ కాబట్టి అతివినయంగా "నమస్కారం సార్!" అన్నాడు. "చూడు నారాయణప్పా! చీరెల సుబ్బారావుకి ప్రమోషనిచ్చి అక్కడే ఏదో పోస్ట్లో ఇరికించి వెంటనే ఆ సమాచారం మా అందరికీ అందేలా చెయ్యి. ఆర్డరు నువ్వే తయారు చేసి మీ సార్ చేత సంతకం పెట్టించు. ఈ ఉపకారం చేశావంటే నీకు అవార్డు ఇప్పిస్తాను" అన్నాడు దీనంగా. చిన్నగా నవ్వేడు నారాయణప్ప.

సరే సార్! అలాగే అనేసి క్షణాలమీద ఆఫీసు ఆర్డరు తయారుచేయించి శేఖర్రావు చేత సంతకం పెట్టించి ఆ శుభవార్త కంప్యూటర్లోకి ఎక్కించి ఓ మీట నొక్కాడు. క్షణంలో ఆ సమాచారం అందరికీ చేరింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ పని ముగించిన నారాయణప్ప బయటికి వెళ్ళి బల్లమీద కూర్చుని ఏడుస్తున్న చీరెల సుబ్బారావు భుజం తట్టి నీ పనైపోయింది. ఇక నీ పని నువ్వు చూసుకో అన్నాడు.

సుబ్బారావు కళ్ళు తుడుచుకుని అమ్మగారికి ఫోన్ చేశాడు. ఆ శుభవార్త చెప్పి ఆనందంగా ఏడిచాడు హిందీలో. ఆవిడ చాలా సంతోషించింది. త్వరగా వచ్చెయ్ అంది.

తెల్లారేసరికల్లా మీ గుమ్మంలో వుంటాను అని హామీ ఇచ్చాడు సుబ్బారావు. మళ్ళీ నారాయణప్ప దగ్గరికి వెళ్ళాడు. అతన్ని హైదరాబాద్ పంపించాలి. అలవాటు ప్రకారం ఏదో పని కల్పించి ఓ ఉత్తరం తయారు చేసి సార్ సంతకం కోసం లోపలికెళ్తూ ఆగాడు నారాయణప్ప.

"నువ్వూ రా. ఓసారి సార్‌కి కనబడి థాంక్స్ చెప్పి మరీ వెళ్ళు. మర్యాదగా వుంటుంది"- అని వెంట బెట్టుకుని తీసికెళ్ళాడు.

భయం భయంగానే శేఖర్రావుకి నమస్కారం పెట్టాడు సుబ్బారావు. తలపక్కకు తిప్పేసుకుని నారాయణప్ప తెచ్చిన కాయితంమీద సంతకం గీకేశాడు శేఖర్రావు. అది తీసుకుని వెళ్ళిపోయాడు సుబ్బారావు.

"ఇతన్ని చూస్తే చిరాకొస్తుంది నాకు. ఈ నెల్రోజులుగా చూస్తున్నాను. పట్టుమని పది రోజులు కూడా ఆఫీసుకి రాడు. టపా పావురంలా హెడ్డాఫీసుకీ ఇక్కడికీ తిరుగుతాడు. ఒక పనీ చాతకాదు. అసలిలాంటి వాళ్ళని పీకి పారెయ్యాలి. ఇంతటి ఘనుడికి ప్రమోషన్లివ్వమని పైవాళ్ల వత్తిడి" అని విసుక్కున్నాడు శేఖర్రావు. మరో ఆర్నెల్లలో రిటైర్ అవడానికి సిద్ధంగా ఉన్న నారాయణప్ప చిన్నగా నవ్వేడు. నిజమే మరి! ఈయనకి గాని పెళ్ళైవుంటే చీరెల సుబ్బారావు ఘనత తెలిసిపోయేది అనుకుని అసలు విషయం చెప్పసాగాడు.

"ఈ సుబ్బారావుకి చాలా ఫ్లాష్‌బాక్ వుంది వినండి. ఈ చీరెల సుబ్బారావు ఇరవై ఏళ్ళక్రిందట మెకానికల్ డిప్లొమా ఫస్ట్‌రేంకుతో పాసై పరీక్షల్లో నెగ్గి గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగంలో చేరాడు. అప్పటికి అతను ఉద్యోగంలో చేరిన అనంతపురం ఆఫీసుకి అతనొక్కడే ఆ కేడర్‌లో వున్న ఉద్యోగి. మిగిలిన వాళ్ళంతా ఇంకా చిన్న ఉద్యోగులే. చేరిన మర్నాడే ఫోను. హైదరాబాద్ నుంచి ట్రంకాల్ అని చెప్పింది ఆపరేటర్. ఆఫీసు వివరాల్నీ గుర్తుతెచ్చుకుని కంగారుపడుతూ ఫోన్‌లోనే రెడీగా వున్నాడు. ఆకుపచ్చని ఎర్రంచు గద్వాల చీరె, పసుపుకి ఆకుపచ్చ అంచు ధర్మవరం పట్టుచీరె, హాఫ్ వైట్‌కి కెంపు అంచు ధర్మవరం పట్టుచీరె అని చెపుతుంటే ఎవరిఫోనో నాకు వచ్చింది అని ఫోన్ పెట్టేశాడు.

పావుగంట తర్వాత మళ్ళీ మోగింది ఫోన్. అసలే లైన్ దొరక్క తంటాలు పడుతూ వుంటే పెట్టేస్తావేం? అప్పుడే కొమ్ములొచ్చాయా? నేను నీ ఆఫీసర్ని అని తిట్టి గడగడ నాలుగు చీరెల వివరాలు చెప్పి ఫోన్ పెట్టేశాడు.

సుబ్బారావుకి అయోమయంగా అనిపించింది. ఈ చీరెల గోలేమిటి? నాకూ ఈ చీరెలకీ ఏమిటీ కనెక్షనూ? మళ్ళీ ఫోన్ చేసి బాస్‌నే అడుగుదామనుకున్నాడు. కానీ అధికార్లెప్పుడూ ఏ పనులు చెయ్యాలో చెప్తారుగాని ఎలా చెయ్యాలో చెప్పరు. అందుకే తన కింది ఉద్యోగులను ఆశ్రయించాడు. వాళ్ళు చరిత్ర అంతా చెప్పారు. ఈ ప్రాంతం చీరెలకు పెట్టింది పేరు. గద్వాల, నారాయణపేట, కొత్తకోట, వెంకటగిరి, ధర్మవరం అన్నీ ఒకదాన్ని మించి మరోటి వుంటాయి. బయటి ప్రాంతాల నించీ పెద్దవాళ్ళు వచ్చినపుడు ఈ ఊళ్ళనించీ చీరెలు పట్టుకెళ్ళటం ఓ ఆనవాయితీ. మీకు ముందుండే సారు కూడా ఇలానే పట్టుకెళ్ళేవారు అని చెప్పి ఆ చీరెలెక్కడ కొనాలో కూడా చూపించారు. ఆ కొట్టువాళ్ళూ, మగ్గాలవాళ్ళూ బాగా మర్యాద చేశారు. పూర్తి డబ్బు కట్టి పది చీరెలు తీసికెళ్ళండి. వాళ్ళు తీసుకోగా మిగిలినవి మడత నలగకుండా వాపసిచ్చి డబ్బు పట్టుకెళ్ళండి అన్నారు. అంత డబ్బు అతని దగ్గరలేదు.

మెళ్ళో గొలుసు వాళ్ళ దగ్గర వుంచి చీరెలు తీసుకున్నాడు. చీరెలు పట్టుకుని నేను వెళ్ళాలా? ఏ ప్యూనుకో ఇచ్చి పంపిస్తే చాలదా అంటే ఆ కొట్టతను హెచ్చరించాడు. ఆ పని మాత్రం చెయ్యకండి. డబ్బుతో కూడిన వ్యవహారం. తేడా వస్తే మధ్యలో మీరు ఇరుక్కుపోతారు అన్నాడు. ఆ రాత్రి బస్సుకి చీరెల మూటతో బయలుదేరి హైదరాబాదు వెళ్ళాడు సుబ్బారావ్.

మెద్రాసునుండి వచ్చిన అమ్మగారి ఎదుట మూట విప్పి ధరలవీ చెప్పి ఆవిడ తీసుకోగా మిగిలినవి భద్రంగా మడతలు వేసి మూట కట్టుకుని వారిచ్చిన డబ్బు తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యాడు. అదుగో అదే మొదలు ఆ తర్వాత ఏదో అప్పుడప్పుడు ఆఫీసు పన్లు చేసినా చీరల చేరవేతే ఎక్కువగా చేస్తూ అనతికాలంలోనే ఆ విద్యలో ఆరితేరిపోయి, చీరెల సుబ్బారావుగా పేరు ప్రఖ్యాతులు గడించాడు. ఎన్నెన్నో మెళకువలు నేర్చుకున్నాడు. గోరింట పోడి రంగుకీ, పెసర రంగుకీ కల అతి చిన్న తేడాని కూడా ఇట్టే కనిపెట్టగల చాకచక్యం అలవరచుకొన్నాడు. బచ్చలిపండు రంగు చీరె తెమ్మన్నా, నెమలికంఠం రంగు చీరె తెమ్మన్నా వీసమంత తేడా రాకుండా అడిగిన రంగే గాలించి పట్టుకొచ్చే స్థాయికి ఎదిగాడు.

ముస్లిమ్ ఆఫీసరుగారి బేగమ్‌గారొచ్చారంటే డిజైనుల్లో హంసలూ, ఏనుగులూ వగైరా ప్రాణికోటి వుండకుండా జాగ్రత్త పడతాడు. వాళ్ళవి కట్టరు. పంజాబీ

అమ్మగారొస్తే పొరబాటున కూడా తెల్లరంగు చీరె లేకుండా చూసుకుంటాడు. పంజాబీ ఆడవారికి తెలుపు రంగు విషాద సూచకం.

మళ్ళీ బెంగాలీ సారొచ్చారు చీరెలు తెమ్మంటే తెలుపు చీరలూ రంగు చీరెలూ కూడా సమంగా పట్టుకెళ్తాడు. బెంగాలీ స్త్రీలు నడివయసు దాటాక రంగు చీరెలు కట్టరు. చిన్న వయసు వారు తెలుపు రంగులు ఇష్టపడరు. కాబట్టి రెండూ తీసికెళ్తే భార్య నాలుగు రంగు చీరెలు ఎంచుకున్నాక తల్లికోసం ఓ తెల్లచీరె తీసుకునే వెసులుబాటు వుంటుంది అయ్యగారికి.

ప్రాంతీయతా జ్ఞానంతో బాటు ఆర్థిక పరిస్థితులను కూడా ఆకళింపు చేసుకున్నాడు. బొంబాయినించీ దేశాయిగారనే ఆఫీసరు వస్తున్నారంటే కొత్తకోట పట్టుచీరెలూ, దర్బారు పేట అంచు వెంకటగిరి చీరెలూ పట్టుకెళ్ళాడు. ఏ చీరే అయిదువేలకి తక్కువ లేదు. మరుసటి వారంలో బీహారునుంచీ సింగుగారు వస్తే సన్నంచు ధర్మవరం చీరెలూ ఉరవకొండలో నేసే గద్వాల చీరెలూ పట్టుకెళ్ళాడు ఏ చీరే వెయ్యికి మించదు.

ఒక్కమాటలో చెప్పాలంటే తన డిపార్టుమెంటుని ఓ కాపుకాస్తున్నాడు సుబ్బారావు. ఎవరైనా పెద్ద అధికార్లుగానీ, లేకపోతే దేశంలో అరాచకాలు జరగక్కుండా గుంపుగా వచ్చి చూసి పోయే రాజకీయ బృందాలుగానీ వస్తే ముందుగా చీరెల సుబ్బారావు అందుబాటులో వున్నాడో లేదో చూసుకుని ఆ తర్వాత కాయితాలూ గట్రా విషయాలు చూసుకుంటారు.

ఒకసారి ఒక ఆఫీసరుగారు పైనించి వచ్చి వీళ్ళ పనీ నిర్వాకం చూసి మండిపడ్డాడు. "ఏవిటిది? మొదలు పెట్టిన పని సాంతం పూర్తికాకుండానే ఇన్ని రిపేర్లా? పనిమంతురాలా ఏం చేస్తున్నావే అంటే పారబోసి ఎత్తుకుంటున్నాను అన్నట్లుంది మీ వ్యవహారం! కాంట్రాక్టర్ ఏడీ? టెండర్లెవరు పాస్ చేశారు? క్వాలిటీ కంట్రోల్ వాళ్ళెక్కడున్నారు? అన్ని వివరాలూ తెల్లారేసరికి నా దగ్గరుండాలి? తేడా వస్తే పీకి పారేస్తానని శివతాండవం ఆడేశాడు.

సదరు శాల్తీలందరికీ కాళ్ళకింద భూమి కదిలినట్లు అయింది. ఒకాయనకి బుర్రపనిచేసింది. అదృష్టవశాత్తూ భార్యా సమేతంగానే వచ్చాడు కాబట్టి వెంటనే

సమ్మోహనాస్త్రం సంధించాడు. రాత్రికి రాత్రి చీరెలు పోగేసుకుని సంజీవనీ పర్వతం తెచ్చిన అంజనేయుడిలాగా వాహనంలో ఆఘమేఘాలమీద వచ్చి వాలిపోయాడు చీరెల సుబ్బారావు.

పొద్దున్నే కాఫీ తాగుతుండగా లోపలికెళ్ళి మూట విప్పాడు. మగ్గాలమీద నిండి నేరుగా తెచ్చాడేమో ఇంకా మార్కెట్‌లోకి రాని ఆ చీరెలు చూసి అమ్మగారి కళ్ళు చుక్కల్లా మెరిసాయి. చాలా సంతోషంగా ఆరు చీరెలు ఎంచుకుంది. సార్ వారు కాస్త ఇబ్బంది పడ్డారు. "అనుకోని ఖర్చు ఇదీ! సర్లే ఈ చీరెలు ఇక్కడే వుంచితే నేవెళ్ళి మనిషికి డబ్బిచ్చి పంపిస్తాను" అన్నారు. ఆ మాటే భద్రంగా తీసుకొచ్చి బయట వున్న సార్‌కి చెప్పాడు సుబ్బారావు.

ఎంత మాట! డబ్బెక్కడికి పోతుంది? మీరెక్కడికి పోతారు? మేమెక్కడికి పోతాం? అసలే పండుగ రోజులు. మేడమ్ కట్టుకుంటారు. వెంట తీసికెళ్ళండి" అని సుబ్బారావు చేతే కబురు పంపించాడు చిన్న సారువారు.

కిందటి రాత్రి డిన్నరూ వద్దు ఏం వద్దు అని బిగుసుకు కూర్చున్న పెద్దసార్ వారు మధ్యాహ్నం ఆయన గౌరవార్థం ఏర్పాటు చేసిన లంచ్‌కి చిద్విలాసంగా విచ్చేశారు. "కాస్త జాగర్తగా వుండండి. మాంసం తింటున్నాం కదా అని బొమికలు మెళ్ళో వేసుకోకూడదు మరి" అని చెప్పి విమానం ఎక్కి వెళ్ళిపోయారు. గండం గట్టెక్కినందుకు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అటువంటి సంఘటనలు ఎన్నో! అలాంటి చీరెల సుబ్బారావుకి అడ్డేముంది? ఆఫీసు పనికి ఆమడదూరంలోనే వున్నా ప్రమోషన్లు వాటంతట అవే వచ్చేశాయి. అవార్డులూ రివార్డులూ మాట చెప్పే పనే లేదు. బోలెడొచ్చాయి. ఇప్పుడు మీరీ ప్రమోషన్‌కి అడ్డుపడినా ఆగేది కాదు. కాబట్టి తలొంచుకొని మన పని మనం చేసుకుపోవాలి. అలా చేసుకుపోతే మన జీవితం సాఫీగా సాగిపోతుంది" అంటూ వివరంగా చెప్పాడు నారాయణప్ప.

శేఖర్రావు గుండె భగ్గున మండింది. "ఇదంతా అన్యాయం కాదా? ఒక ఉద్యోగంలో చేరి చక్కగా జీతం పుచ్చుకుంటూ ఆ పని మానేసి ఇటువంటి వృథా వ్యవహారాల్లో తలదూరిస్తే అతను చేయాల్సిన పని ఎవరు చేస్తారు? ఇటువంటి వ్యవహారాలను వారించవలసిన పైవాళ్ళు కూడా ప్రోత్సహించటం అధికార దుర్వినియోగం కదా!" అన్నాడు. ఆక్రోశాన్ని అర్థం చేసుకున్న నారాయణప్ప భీష్మాచార్యుడిలా నవ్వేడు.

నిజమే మీరు చెప్పింది. అడుగడుగునా అధికార దుర్వినియోగమే. ఒక్క ప్రముఖుడికోసం వినియోగించే రక్షక దళాలను సగానికి సగం కుదించి ఆ దళాలను ప్రజల రక్షణ కోసం వినియోగిస్తే దొంగతనాలూ, దోపిడీలూ ఇంతగా పెట్రేగిపోతాయా? ప్రభుత్వ వాహనాలను, స్వంత పనులకు వాడరాదనే నియమాన్ని ఖచ్చితంగా పాటిస్తే ఇంధనం ఖర్చు సగానికి సగం తగ్గుతుంది.

చిరుద్యోగులను తమ స్వంత పనులకు వినియోగించుకోరాదనే రూల్స్‌ని నిష్ఠగా పాటిస్తే అయ్యగారి చెప్పులు మోస్తూనో, అమ్మగారికి కూరలు తెచ్చి పెడుతూనో, వారి పిల్లలనీ కుక్కలనీ ఆడిస్తూనో ఉండే చిరుద్యోగులు కనిపించరు. ఎవరి పని వారు చేసుకుంటూ తమ సేవలను సక్రమంగా వినియోగిస్తూ సార్థక జీవులవుతారు.

'ఇప్పుడు ఈ చీరెల సుబ్బారావు విషయం మీ దృష్టికి వచ్చింది కాబట్టి మీకు బాధగా ఉంది. ఇటువంటి వారు కోకొల్లలుగా వున్నారు" అన్నాడు నారాయణప్ప.

"ఇలా ఎంత కాలం?" దీనంగా ప్రశ్నించాడు శేఖర్రావు.

"ఏమో! నా జీవితకాలం ఇలాగే గడిచిపోయింది. మరో ఆరు నెలల్లో రిటైరైపోతాను. మీ జీవితకాలంలో మీరు కోరుకుంటున్న మార్పు వస్తుందేమో లెండి సార్! మీరు రిటైరయ్యే నాటికి గతంలో ఇలాంటి చీరెల సుబ్బారావులుండేవారని మీకంటే వయసులో చిన్నవారికి కథలుగా చెప్తారేమో" అన్నాడు నారాయణప్ప.

శేఖర్రావు ఆలోచిస్తూ వుండిపోయాడు.

*ఆంధ్రభూమి దినపత్రిక, 20 మార్చి 2010*